క్లుప్తంగా

హర్షం

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు రావటం హర్షణీయమని పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం.సీతన్న అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 2011లో ప్రారంభమైన వైఎస్సార్‌టీఏకు జీఓ నంబర్ 32 ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గుర్తింపు నివ్వడం సంతోషదాయకమన్నారు. గత పోరాటాల మాదిరిగానే రాబోయే రోజుల్లో కూడా ఉపాధ్యాయుల సమస్యలపై చిత్తశుద్ధితో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు సీతన్న పేర్కొన్నారు.

సచివాలయాల్లో పోటీ పరీక్షల పుస్తకాలు

గుమ్మలక్ష్మీపుం: గ్రామ సచివాలయాల్లో నిరుద్యోగ యువతకు ప్రయోజనం కలిగేలా పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచడం హర్షణీయమని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోరాజు అన్నారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. గ్రూప్ 1, 2 మెయిన్స్, డీఎస్సీ, తదితర ఉద్యోగాలకు సంబంధించిన పుస్తకాలు సచివాలయాల్లో అందుబాటులో ఉండడం వల్ల నిరుద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

సచివాలయాలతో ప్రజల వద్దకు పాలన

• ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



గ్రామ సచివాలయం భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గ్రామ సచివాలయాల వల్ల ప్రజల వద్దకు పాలన అందుతోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని దేవనాపురం, మండ, తదితర గ్రామాల్లో సచివాలయ, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన పాలన దేశానికే ఆదర్శమన్నారు. ఏ సమస్య వచ్చినా సచివాలయం ద్వారా పరిష్కారమవుతున్నాయని చెప్పారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు ఎంతో విలువైన సేవలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హిమరక మోహనరావు, ఎంపీడీఓ గీతాంజలి, సర్పంచ్‌లు మౌనిక, సుశీల పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న సిబ్బంది

గరుగుబిల్లి: ఎన్నికల ప్రకటన వెలువడిన తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోనికి వస్తుందని తహసీల్దార్ కె.జయ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, మహిళా పోలీసులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే అమల్లోకి రానున్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు పరచాలన్నారు. ఎలాంటి ఉల్లంఘనలకు అవకాశం లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని, ఎక్కడా ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ పి.సూర్యనారాయణ, ఈఓపీఆర్‌డీ గోపాలరావు, ఆర్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై లైవ్ ఫిష్ వాహనం అందజేత



లైవ్ ఫిష్ వాహనాన్ని లబ్ధిదారునకు అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: సబ్సిడీపై లైవ్ ఫిష్ మొబైల్ వాహనాన్ని (4 చక్రాల బండి) కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన బత్తుల సాయి పవన్‌కు శుక్రవారం అందజేశారు. చేపల వ్యాపారం, లైఫ్ ఫిష్ రవాణా నిమిత్తం రూ.13 లక్షల 29వేల 958 విలువ గల వాహనాన్ని సబ్సిడీ40శాతం, లబ్ధిదారుని వాటా 20 శాతం, బ్యాంకు లోన్ 40 శాతంతో లబ్ధిదారునకు అందజేయడం జరిగిందని జిల్లా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఈశ్వరరాజు, గోపికృష్ణతో పాటు గుమ్మలక్ష్మీపురం ఎంపీపీ కె.దీనమయ్య, సర్పంచ్ గౌరీశంకరరావు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

పాలకొండ రూరల్: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బాసూరు సర్పంచ్ ఎస్. మల్లేశ్వరమ్మ అన్నారు. గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్, నేత్ర వైద్య నిపుణులు టి.కృష్ణమూర్తి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.గురునాయుడు, తదితరులున్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి
- తోటపల్లిలో సచివాలయం, ఆర్‌బీకే ప్రారంభం
- ప్రజలు గర్వపడేలా జగనన్న పాలన



తోటపల్లిలో ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: ప్రజల ముంగిటకే పరిపాలనను అందించేందుకు గ్రామసచివాలయ వ్యవస్థను జగనన్న ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.23.94లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు ప్రజలకిచ్చిన మాట ప్రకారం ప్రజల ముంగిటకే ప్రభుత్వ పరిపాలనను తీసుకువస్తానని, నేరుగా ప్రతి ఇంటికి సేవలు అందిస్తానని చెప్పి సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలను తీసుకురావడం జరిగిందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి ప్రభుత్వ భవనాలను నిర్మించి ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలు గర్వంగా చెప్పుకునేలా జగనన్న పాలన ఉందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ చెప్పని పలు సంక్షేమాలను అమలు చేస్తూ జగనన్న అందరి చేత శభాష్ అనిపించుకొనేలా పాలిస్తున్నారన్నారు. పేదోడి రాజ్యం జగనన్నతోనే సాధ్యమన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందే విధంగా ప్రణాళికలు రూపొందించి సహాయం అందేలా చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, స్థానిక సర్పంచ్ ఆవాల సింహచలమమ్మ, డి.పారినాయుడు, ఆవాల కన్నయ్య, ఎం.శంకరరావు, ఎం.శీతంనాయుడు తదితరులున్నారు.

ప్రజల పక్షపాతి సీఎం జగన్



నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో తన స్వగృహంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి పేదలకు ఇళ్ల పట్టాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేసి నిర్మాణానికి ఇంటి గ్రాంటును మంజూరు చేసి శాశ్వత హక్కు పత్రం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. జగనన్న ప్రతి పేదకుటుంబానికి ఇల్లు మంజూరు చేస్తానని పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలో 2003 సంవత్సరం నుండి డీ పట్టా భూములు కలిగి ఉన్న 800 మందికి దానిపై పూర్తి హక్కులు కల్పిస్తూ శాశ్వత పట్టా పంపిణీ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధిపై అవగాహన



గ్లకోమ పరీక్షలు నిర్వహిస్తున్న నగేష్‌రెడ్డి

కురుపాం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నీటి కాసుల వ్యాధి(గ్లకోమ)పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి వ్యాధిపై అవగాహన కల్పించారు. 45 సంవత్సరాలు దాటిన తరువాత ప్రతి ఒక్కరూ నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం పలువురికి నేత్ర పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. వైద్యులు సుకృత, మౌనిక, ఆశాలత, నేత్ర వైద్య సహాయకులు ఉమామహేశ్వరి, మాలిక తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి భూమిపూజ



శివాలయం నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: మండలంలోని నీలానగరంలో దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో శివాలయం నిర్మాణానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శుక్రవారం భూమిపూజ చేశారు. రూ. 20 లక్షలతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి పురుషోత్తమరావునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.రాంబాబు, పాలవలస సోమశేఖర్, ధవళేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌కు సొంత భవనం



పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద పీఏసీఎస్ అధ్యక్షుడు, సీఈఓ, సిబ్బంది

వీరఘట్టం: అద్దె భవనాల్లో కాలం గడుపుతున్న స్థానిక వ్యవసాయ సహకార పరపతి సొసైటీ కార్యాలయానికి (పీఏసీఎస్) ఎట్టకేలకు సొంత భవనం సమకూరింది. పాత తహసీల్దార్ కార్యాలయాన్ని పీఏసీఎస్‌కు కేటాయించినట్లు అధ్యక్షుడు కర్రి గోవిందరావు తెలిపారు. ఈ మేరకు భవనానికి శుక్రవారం ఉదయం పీఏసీఎస్ బ్యానర్ కట్టి కలెక్టర్, తహసీల్దార్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సీఈఓ బూరాడ పైడిరాజు, డైరెక్టర్లు భోగి మణి, రంభ శ్రీను, సిబ్బంది మురళి, నాగేశ్వరరావు, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

కార్మికశాఖ పరిధిలో సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్‌కు సంబంధించి నిర్వహిస్తున్న ప్రజావేదిక

పాలకొండ రూరల్: ఏపీ భవన నిర్మాణ, కార్మిక రంగాలకు చెందిన సంక్షేమ నిధుల వినియోగం, చెల్లింపులపై వారం రోజులుగా పాలకొండ క్లస్టర్‌లో సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు కార్మికశాఖ సహాయ కమిషనర్ పి.సువర్ణ తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సిబ్బంది సేకరించిన సమాచారం మేరకు లబ్ధిదారుల సమక్షంలో సమీక్ష చేపట్టారు. 2018 - 19, 19 - 20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్లస్టర్ పరిధిలో పాలకొండలో 101, భామిని మండలంలో 42, సీతంపేటలో 7 క్లయిమ్‌లు నమోదైనట్లు చెప్పారు. క్లయిమ్‌లకు సంబంధించిన బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీఎం వై.గౌరీశంకర్, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, ఎస్ఆర్పీ గోవిందరాజు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్‌ఓ కల్పనాకుమారి

సీతంపేట: ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి కోడ్ అమల్లోకి వస్తుందని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె. కల్పనకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక తన కార్యాలయంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ టీమ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లోపు బహిరంగ ప్రదేశాల్లో ఉండే రాజకీయ నాయకులకు సంబంధించిన స్టిక్కర్లను, ఫ్లెక్సీలను తొలగించాలని.. విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసే ఎటువంటి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. సర్వేలైన్స్ బృంద సభ్యులను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమయ్యే వాహనాల ఏర్పాటుకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ చేయాలని ఆర్టీసీ డీఎం, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ, సీఐ, ఎంపీడీఓలు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల అంశాలపై శిక్షణ..

ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన నియమాలు, రిపోర్ట్‌లు సమర్పించే అన్ని రకాల ఫారాలపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీస్ హేమసీకుమార్, శ్రీనివాస్, సెక్టార్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వమే రావాలి..



జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

వీరఘట్టం: తమ సొంతింటి కల నెరవేర్చిన జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలని దశుమంతపురం మహిళలు నినాదాలు చేశారు. గ్రామానికి చెందిన 34 మంది మహిళలకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి శుక్రవారం అందజేశారు. ఈ సమయంలో మహిళలు జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ, తమ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్, వీఆర్‌ఓ జి.రాజేంద్ర, వావిలపల్లి హరిబాబు, సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

404 మందికి ఆరోగ్య పరీక్షలు

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలసలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 404 మంది గ్రామస్తులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించినట్లు డాక్టర్లు ప్రదీప్‌కుమార్, జయశ్రీ తెలిపారు. చిన్న, చిన్న ఆరోగ్య సమస్యలతో ఉన్న వారికి బీపీ, సుగర్, తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆప్తాలమిస్ట్ దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా సీఎం సహాయ నిధి



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. భామిని మండలం సొలికిరి గామానికి చెందిన నరాల రాంప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన లక్ష రూపాయల చెక్కును వండవ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో భామిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తకోట చంద్రశేఖరరావు, జామి ప్రభాకరరావు, కొత్తకోట ఆంజనేయులు, బిడ్డిక గౌయింతి, బిడ్డిక నూకయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాలకొండ: పాలకొండ - పార్వతీపురం ప్రధాన రహదారిలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. మండలంలోని టీకే రాజపురం గ్రామానికి చెందిన పాగిరి సూరిబాబు, నేతల మాధవ్ తమ గ్రామం నుంచి పాలకొండ వైపు ద్విచక్రవానం మీదుగా వస్తున్నారు. తంపటాపల్లి గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి రహదారిపై పడిపోయారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఎస్సై ప్రశాంత్‌కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యుద్ధప్రాతిపదికన కాజ్‌వే నిర్మాణం

భామిని: మండలంలోని బత్తిలి వెర్రిగెడ్డపై నిర్మిస్తున్న కాజ్‌వే పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఐటీడీఏ ఏఈఈ విజయ కుమార్ పర్యవేక్షణలో కాజ్‌వే బెడ్ కాంక్రీట్ పనులు ముమ్మరంగా చేపట్టారు. ఇటీవల బత్తిలిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి దృష్టికి కాజ్‌వే నిర్మించాల్సిన ఆవశ్యకతను ఎంపీటీసీ సభ్యుడు టింట అన్నాజీరావు, సర్పంచ్ టి. శాంతికుమారి తీసుకెళ్లారు. దీంతో ఆమె వెంటనే ఐటీడీఏ అధికారులతో మాట్లాడి రూ. 33 లక్షలు మంజూరు చేయించారు. దీంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి.

గర్భిణులకు సంక్షేమం

• డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: జగనన్న ఆరోగ్య ఆసరా పథకంతో గర్భిణుల సంక్షేమానికి భరోసా కలుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రోగ్రాం అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ గర్భిణులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ ఆస్పత్రి ప్రసవాలు, సాధారణ ప్రసవాలు జరిగేందుకు కృషి చేయాలని సూచించారు. మొదటి కాన్పు గర్భిణికి రూ.5000 లబ్ధి విడతల వారీగా మొదటి విడత రూ.3000 (గర్భిణి నమోదు సమయంలో), రెండవ విడతగా ప్రసవం తర్వాత, బిడ్డకు మూడవ మోతాదు టీకా వేశాక రూ.2000 లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేయనున్నట్లు చెప్పారు. ఆడపిల్ల జననాలు ప్రోత్సహించేందుకు, స్త్రీ లింగ నిష్పత్తి పెంచేందుకు రెండవ కాన్పులో ఆడపిలను ప్రసవిస్తే మూడవ మోతాదు టీకా పూర్తయిన తర్వాత ఒకే విడతలో రూ.6000 తల్లి ఖాతాలో జమవుతాయని చెప్పారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించే దిశగా డా. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, ఎంపిక చేసిన నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు రూ. 5000 లబ్ధిదారుని ఖాతాలో జమవుతాయన్నారు. జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) డాక్టర్ టి. జగన్ మోహనరావు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన తప్పనిసరి



అవగాహన పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: వస్తు వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో వాణిజ్య విభాగం నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకుని సహచరులను చైతన్యపరచాలని సూచించారు. అనంతరం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, ఉపన్యాసకులు పి.రాజ్యలక్ష్మి, ఎం.శాంతికుమారి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

• శంకుస్థాపన..



అడారు-డెప్పివలస రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మండలంలోని రెండు కొత్త రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కొబ్బరికాయ కొట్టి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అడారు నుంచి డెప్పివలసకు 1.5 కిలోమీటర్లు, బిటివాడ హైస్కూల్ నుంచి డెప్పివలసకు 0.75 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు వేయనున్నారు. పది రోజుల్లో నిర్మాణాలు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అడారు సర్పంచ్ నీలం సంధ్యారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు నీలం సత్యంనాయుడు, గణపతిరావునాయుడు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో రహదారి..

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస, యు.వెంకమ్మపేట, సీఎస్ఆర్ పేట రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆయా పనులకు ఎమ్మెల్యే కళావతి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ శ్రీను, సొంట్యాన సింహాచలం, భవిరి సుదర్శనరావు, వారాడ శ్రీరాములనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట మూడు రోడ్ల జంక్షన్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ మేరకు చలివేంద్రాన్ని ఉమ్మడి పార్టీల నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు పి.దివాకర్, ఎం.భూషణరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో పాదాచారులు, ప్రయాణికుల దాహం తీర్చేందుకు 24 గంటల పాటు చల్లని తాగునీటిని అందించేలా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిందితులను శిక్షించాలి



మండంగి రాధిక, జెడ్పీటీసీ

గుమ్మలక్ష్మీపురం: తెనాలికి చెందిన గీతాంజలి మృతికి కారకులైన టీడీపీ సోషల్ మీడియాకు చెందిన కారకులను కఠినంగా శిక్షించాలని గుమ్మలక్ష్మీపురం జెడ్పీటీసీ సభ్యురాలు మండంగి రాధిక డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలన తాను పొందిన లబ్ధిని ఓ సభలో వివరించడమే ఆమె చేసిన నేరమన్నట్లుగా టీడీపీ - జనసేన సోషల్ మీడియా మూకలు ఆమెపై కక్ష కట్టాయన్నారు. సోషల్ మీడియా వేదికగా ఆ పార్టీ శ్రేణులు చేసిన అసభ్యకర వేధింపులే పేదింటి మహిళలను బలి తీసుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల గౌరవం చూపని క్రూరులైన కారకులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆపదలో ఉండగా వైఎస్సార్ బీమా



వైఎస్సార్ బీమా అందిస్తున్న సర్పంచ్ దివ్యలక్ష్మి

గరుగుబిల్లి: ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా వైఎస్సార్ బీమా ఉందని ఉల్లిబద్ర గ్రామ సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మి అన్నారు. గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గునుపూరు మన్మథరావు కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.10వేల నగదును ఆయన భార్య గునుపూరు లక్ష్మికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు మాట్లాడుతూ కుటుంబ పెద్ద చనిపోతే ఆ కుటుంబానికి అండగా ఉండేందుకు వైఎస్సార్ బీమా పథకం ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి యు.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెరటి మొక్కల సాగుతో లాభాలు



పెరటి తోటలపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ బృందం సభ్యులు

గరుగుబిల్లి: పోషక విలువలున్న పెరటి కూరగాయల పెంపకంతో మంచి లాభాలు ఉన్నాయని అగ్రికల్చర్ అసిస్టెంట్ హరీష్ అన్నారు. డా.వైఎస్సార్ ఉద్యాన కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మన గ్రామం - మన విశ్వవిద్యాలయం మండలంలోని సంతోషపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. పెరటి తోటల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో, జగనన్న గోరుముద్ద పథకంలో పెరటి తోటలలో పండించిన కూరగాయలను, ఆకుకూరలను నిర్వాహకులు వినియోగిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు సర్పంచ్ కె.రవీంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.హరిరామకుమార్, ఆర్.రాజ్యలక్ష్మి, కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలకు చెక్



మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాష్‌ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కొమరాడ: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ శెట్టి శ్యామల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో క్రాష్ కార్యక్రమం ఏర్పాటు చేసి సంబంధిత సామగ్రితో కూడిన వ్యాన్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఎక్కువగా బోరు బావులు మరమ్మతులకు గురవుతున్నాయని, వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, ఎంపీడీఓ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీన్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.